సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
శనివారం । 16 । డిసెంబర్ । 2023



రహదారి పనుల్లో కదలిక

67వ నంబరు జాతీయ రహదారి పనుల్లో కదలిక ప్రారంభమైంది. ఇది జమ్మలమడుగు, ప్రొద్దుటూరు మీదుగా వెళ్తుంది.

-8లో



కిరాయి పేరుతో మోసం

కార్లు అద్దెకు కావాలంటూ ఓ మోసగాడు కార్ల యజమానులకు టోకరా వేసిన సంఘటన గుర్రంకొండలో చోటుచేసుకుంది.

-8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.3/19.4


జిల్లాలో శుక్రవారం 19.4 - 28.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

కూలీలకు కర్షకుడి హోదా

- నిరుపేదలకు వరం.. శాశ్వత భూ హక్కు పథకం
- జిల్లాలో 2,116 మందికి 3,119.99 ఎకరాలు





కడప సెవెన్‌రోడ్స్: దేశంలోనే తొలిసారి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష' పథకాన్ని చేపట్టింది. చుక్కల భూములు, సర్వీసు ఇనాం భూములు, షరతులతో కూడిన డీకేటీ పట్టాలపై ఉన్న ఆంక్షలు తొలగించింది. ఆయా భూములు సాగు చేసుకుంటున్న రైతులకు సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పించింది. అదే కోవలో జిల్లాలోని నిరుపేదలకు కొత్తగా అసైన్డ్ భూములు పంపిణీ చేయడం ద్వారా రైతు హోదా కల్పించి వారు ఆత్మగౌరవంతో బతికేందుకు అవకాశం కల్పించింది.

గతంలో..

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న నిరుపేదలకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో భూ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. భూమి అసలే లేని పేదలు, ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న శివాయి జమదారులకు పట్టాలు పంపిణీ చేశారు. గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. జిల్లాలో వైఎస్ హయాంలో, ఆ తర్వాత ఇప్పటిదాకా ఏడు విడతల్లో భూ పంపిణీ జరిగింది. దీని ద్వారా 32,256 మందికి 53,205 ఎకరాలు పంపిణీ చేశారు. డి.ఫారంతో పాటు స్కెచ్, పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్ వంటి డాక్యుమెంట్లు ఒకేసారి లబ్ధిదారుకు ఇవ్వడంతో పాటు పొసెషన్ హ్యాండోవర్ చేశారు. వ్యవసాయ బోరు, డ్రిప్, స్ప్రింక్లర్లు తదితరాలతో తోడ్పాటు అందించారు.

ముఖ్యమంత్రి ఆదేశాలతో..

తాజాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మరోసారి భూపంపిణీ చేపట్టారు. ప్రస్తుత భూ పంపిణీలో కూడా శివాయి జమదారులే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరు ప్రభుత్వ భూములను అనేక ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. అయితే ఆ భూములపై పట్టాలు లేకపోవడంతో బ్యాంకు రుణం, విత్తనాలు, ఎరువులు, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా తదితర సౌకర్యాలకు నోచుకోలేని పరిస్థితి ఉండేది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందినవారు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటుండేవారు. ప్రభుత్వ నిర్ణయంతో వీరందరికీ లబ్ధి చేకూరుతోంది. ఈ మేరకు అధికారులు గ్రామాల వారీగా అర్హుల జాబితాలను సిద్ధం చేసి అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. జిల్లాలో 2,116 మంది లబ్ధిదారులకు 3,119.99 ఎకరాలు పంపిణీ చేయడానికి నిర్ణయించారు. ఈ క్రమంలో ఆరోపణలకు అవకాశం లేకుండా అసైన్డ్ భూముల పంపిణీ కొనసాగుతోంది.

రెవెన్యూ డివిజన్ల వారీగా...

డివిజన్	మండలాలు	లబ్ధిదారులు	ఎకరాలు
కడప	ఖాజీపేట, పెండ్లిమర్రి	124	201.13
జమ్మలమడుగు	రాజుపాలెం, పెద్దముడియం దువ్వూరు	174	245.21
పులివెందుల	సింహాద్రిపురం, వేంపల్లె వేముల, లింగాల, చక్రాయపేట తొండూరు, వీఎన్ పల్లె	1818	2673.65

భూమికి డి.ఫారంతో భరోసా



మేము కొంత ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నాము. మెట్ట పైర్లు వేసుకునే వాళ్లం. ఈ భూమికి పంట రుణాలు బ్యాంకర్లు ఇచ్చేవారు కాదు. అలాగే ప్రభుత్వం నుంచి అందే ఇతర సదుపాయాలు కూడా లభించేవి కావు. ఏదైనా ప్రకృతి విపత్తులు సంభవించినపుడు పరిహారం కూడా లభించేది కాదు. గత పదేళ్లుగా మా భూమికి పట్టా ఇవ్వాలంటూ కార్యాలయాల చుట్టూ తిరిగినప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా ఉండేది. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం వల్ల మా భూమికి డి.ఫారం ఇచ్చారు. దీంతో మాకు ఎంతో భరోసా లభిస్తోంది.

– మల్లెం శాంతమ్మ, మొయిళ్లకాల్వ, పెండ్లిమర్రి మండలం

జగనన్న సాయం మరువలేం



మేము గత 20 ఏళ్లుగా 1.50 ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నాం. పంటలు సాగు చేసుకుంటున్నా ప్రభుత్వం రైతులకు ఇచ్చే వివిధ రకాల సదుపాయాలు అందేవి కావు. సాగు పట్టా ఇవ్వాలంటూ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ఎన్నోసార్లు తిరిగాము. కానీ ఎవ్వరూ పట్టించుకోలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అసైన్‌మెంట్ కమిటీలో మా పేరు చేర్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాయాన్ని ఎన్నటికీ మరువలేం.

– చీకటి నాగలక్షుమ్మ, కొండ సుంకేసుల గ్రామం, పెద్దముడియం మండలం

న్యూస్‌రీల్

జిల్లాకు వర్షసూచన



కడప అగ్రికల్చర్: వాతావరణ కేంద్రం(అమరావతి) సూచన మేరకు రాబోయే ఐదు రోజుల్లో వైఎస్సార్ జిల్లాలోని పలు మండలాలకు వర్ష సూచన ఉందని కృషి విజ్ఞానకేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వీరయ్య, వాతావరణ విభాగ శాస్త్రవేత్త స్వామి చైతన్యలు తెలిపారు. 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లాలోని పలు మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మాదిరి వర్షం పడవచ్చన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

22న జాబ్‌మేళా

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 22వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా။వి.సలీంబాషా తెలిపారు. జేకేసీ ఆధ్వర్యంలో టెక్ సేవా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో నిర్వహించే ఈ డ్రైవ్‌లో 15 మల్టీనేషనల్ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. 10 తరగతి మొదలు డిగ్రీ వరకు చదువుకున్నవారంతా ఈ డ్రైవ్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. అభ్యర్థులు రెజ్యూమ్‌తో పాటు అర్హత ధృవీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9849022809, 9059066031 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఫలితాలు విడుదల



మాట్లాడుతున్న జెఎన్‌టీయూ ప్రిన్సిపల్ రమణారెడ్డి

పులివెందుల రూరల్: పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాలలో శుక్రవారం బీటెక్ కోర్సుకు సంబంధించి సెమిస్టర్, సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్లు ప్రిన్సిపల్ ఆర్.రమణారెడ్డి తెలిపారు. పూర్తి వివరాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు.

నూతన నియామకం



రాంప్రసాద్‌రెడ్డి

పుల్లంపేట: గుంతకల్ డివిజన్ పరిధిలో రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా పుల్లంపేటకు చెందిన రాచమల్లు రాంప్రసాద్ రెడ్డి నియమితులయ్యారు. ఈయన బీజేపీ కిసాన్ మోర్చ సోషల్ మీడియా రాష్ట్ర కో–కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. 31 డిసెంబర్, 2024వ తేదీ వరకు ఆయన ఆర్‌యూసీసీ సభ్యుడిగా కొనసాగుతారు.

బాధ్యతల స్వీకరణ

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పి.చెంగల్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఈడీగా పనిచేస్తున్న గిడుగు వెంకటేశ్వర రావు వ్యక్తిగత కారణాలతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో తిరుపతి జిల్లా ఆర్‌ఎంగా పనిచేస్తున్న చెంగల్‌రెడ్డిని ఉన్నతాధికారులు నియమించారు.

పీఎల్‌ఐలో స్టేట్‌ఫస్ట్



రాపూరి రెడ్డిశేఖర్

పెద్దతిప్పసముద్రం: అన్నమయ్య జిల్లాలోని పెద్దతిప్పసముద్రం సబ్–పోస్ట్‌మాస్టర్ రాపూరి రెడ్డిశేఖర్‌కు పోస్టల్ లైఫ్ ఇన్స్యూరెన్స్ చేయించడంలో రాష్ట్రంలోనే మొదటి స్థానం దక్కింది. ఈ మేరకు రాష్ట్ర తపాలా శాఖ ఉన్నతాధికారుల నుంచి శుక్రవారం సబ్–పోస్ట్‌మాస్టర్ ఆయనకు సమాచారం అందింది. 2022–2023 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ తపాలా జీవిత బీమాకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడంతో ఈ అవార్డు దక్కింది.

ఎంవీఆర్‌ఆర్‌కు లైఫ్‌టైమ్ అవార్డు



అవార్డును అందుకుంటున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప ఎడ్యుకేషన్: నూతన టెక్నాలజీ, సరికొత్త విధానాలతో విద్యార్థులకు చక్కటి బోధన అందించినందుకు కడప సాయిబాబా విద్యాసంస్థల అధినేత, ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డికి 'బ్రెయిన్ ఫీడ్ లైఫ్‌టైమ్ అఛీవ్‌మెంట్ అవార్డు' దక్కింది. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఆ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద, కలోరెక్స్ గ్రూప్ సీఈఓ అండ్ ఎండీ డాక్టర్ మంజులా పూజా ష్రాఫ్ మరియు బ్రెయిన్ ఫీడ్ సీఈఓ బ్రహ్మంల చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

నేడు డీఆర్డీఓ డైరెక్టర్ రాక

కురబలకోట: భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) డైరెక్టర్(విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ) మేజర్ జనరల్ ఎంకే హడ శనివారం అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు విచ్చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ శుక్రవారం తెలిపారు. కళాశాలలో జరిగే ఫ్రెషర్స్‌డేకు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

తిరుమలకు ఆకేపాటి పాదయాత్ర ప్రారంభం



రాజంపేటలో ఆకేపాటి అమరనాథరెడ్డి పాదయాత్ర దృశ్యం

రాజంపేట: జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి తిరుమలకు అన్నమయ్య కాలిబాటలో 21వ సారి మహా పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం సాయంత్రం ఆకేపాడు ఆలయాల నుంచి ప్రారంభించారు. ఆయన వెంట గోవింద భక్తులు శ్రీ వెంకటేశ్వరస్వామిపై కీర్తనలు ఆలపిస్తూ ముందుకు సాగారు. ఆకేపాటి సోదరుడు ఆకేపాటి అనిల్ రెడ్డి నేతృత్వంలో పాదయాత్ర కొనసాగింది. కోలాటలు, భజనలు, గోవింద నామస్మరణతో మార్మోగింది. అన్నమయ్య కీర్తనలతో ఆద్యంతం భక్తిభావంతో కొనసాగింది. ఉత్సాహ భరితంగా బాణసంచాలు కాల్చారు.

శ్రీనివాసుని ఊరేగింపు: పాదయాత్రలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి ఊరేగింపు చేపట్టారు. పాదయాత్ర పట్టణంలోకి ప్రవేశించిన తర్వాత పండరి భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మాజీ ఎమ్మెల్యే ప్రభావతమ్మ తనయుడు కొండూరు విజయ్ రెడ్డి, రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి బావమరిది మదన్‌రెడ్డి పాదయాత్రలో పాల్గొన్నారు.

పాదయాత్ర సాగిందిలా..

రాజంపేట పట్టణంలోని మార్కెట్ సర్కిల్, పాత బస్టాండు సర్కిల్‌లో ఆకేపాటిని పలువురు గజమాలతో సత్కరించారు. ఏఐటీఎస్ సర్కిల్‌లో ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి, ఎంజీపురంలో సీనియర్ న్యాయవాది కొండూరు శరత్‌కుమార్‌రాజు, యల్లమ్మగుడి వద్ద మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, కాకతీయ విద్యా సంస్థల అధినేత పోలా రమణారెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు పీసీ యోగీశ్వరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రిరవి, కౌన్సిలర్లు కూండ్ల రమణారెడ్డి, రాము యాదవ్, టీటీడీ చైర్మన్ సోదరుడు భూమన శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు పాపినేని విశ్వనాథరెడ్డి, గోపిరెడ్డి, అరిగెమణి, భాస్కర్‌రాజు, సౌమిత్రి, విశ్వనాథరాజు, జెడ్పీటీసీలు గడికోట ఉషాసుబ్బారెడ్డి, దాసరి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వజన్మ సుకృతం

21వ సారి అన్నమయ్య కాలిబాటలో నడిచి శ్రీవారి దర్శనం చేసుకోవడం నా పూర్వజన్మ సుకృతం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్నమయ్య కాలిబాట అభివృద్ధికి బీజం పడింది. సీఎం వైఎస్ జగన్‌కు శ్రీ వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు కలగాలని ప్రార్థిస్తున్నాను. -ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్

సమస్యల పరిష్కారానికే 'జగనన్నకు చెబుదాం'



కలెక్టర్ విజయరామరాజుకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి

పెద్దముడియం: ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో పారిశుద్ధ్యం, వీధి బల్బుల సమస్య, సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని, సత్వరమే పరిష్కరించాలని ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లును ఆదేశించారు. పెద్దపసుపుల, జంగాలపల్లె, కొండసుంకేసుల, గుండ్లకుంట, చిన్నపసుపుల సచివాలయాల నుంచి ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి అర్జీల రూపంలో వచ్చిన సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

కరువు మండలంగా ప్రకటించాలి: ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి

పెద్దముడియాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కలెక్టర్ విజయరామరాజును కోరారు. ఈ ప్రాంతంలో వర్షం లేకపోవడంతో కొందరు రైతులు పంటలు సాగుచేయలేదని, వేసిన పంటలు కూడా ఎండిపోయాయన్నారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న రహదారులు కూడా వెంటనే పూర్తి చేయించాలని, వివిధ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు తెలిపారు. కాగా, 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో 97 ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపీడీఓ వెంకటరమణయ్య తెలిపారు. జేసీ గణేష్ కుమార్, ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎంపీపీ కె.కె.సుధ, జెడ్పీటీసీ సి.హిమజ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఈ క్రాప్.. భరోసాలో టాప్

- జిల్లాలో ప్రారంభమైన నమోదు ప్రక్రియ
- నేరుగా సాగుదారులకే ప్రభుత్వ పథకాలు
- పొలం వద్దనే రైతుల నుంచి సమాచార సేకరణ
- ఇప్పటివరకు 28.74 శాతం నమోదు



కడప మండలంలోని రూకవారిపల్లెలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (ఫైల్)

కడప అగ్రికల్చర్: వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వ్యవసాయ సాగులో రైతాంగాన్ని అడుగడుగునా ఆదుకుంటూ అండగా నిలుస్తోంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వారికి కావాల్సిన అన్ని రకాల సేవలను అందిస్తున్నారు. విత్తనం మొదలుకుని పంట దిగుబడి చేతికొచ్చే వరకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. పంట దిగుబడులకు మద్దతు ధరను కల్పించి అక్కడే కొనుగోలు చేస్తూ అన్నదాతకు అండగా ఉంటోంది. అలాగే రైతులకు పంటలసాగు పెట్టుబడికి రైతు భరోసా ద్వారా నేరుగా వారి ఖాతాల్లో జమచేసి సాగుకు సాయం చేస్తోంది. దీంతోపాటు అర్హులైన రైతులకు ప్రభుత్వ పథకాలను అందించాలనే లక్ష్యంతో ఈ క్రాప్ పేరుతో పారదర్శకతకు పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా రైతులు ఏఏ పంటలను సాగు చేశారు, ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే వివరాలను నేరుగా రైతు పొలం వద్దకే వెళ్లి సేకరిస్తోంది. ఆర్‌బీకే పరిధిలో అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ అసిస్టెంట్స్ ద్వారా ఈ క్రాప్‌లో నమోదు చేయిస్తున్నారు. ఈ ప్రక్రియలో జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది.

జిల్లాలో రబీ సాగుకు సంబంధించి ఈ క్రాపు నమోదు వివరాలు

జిల్లాలో 36 మండలాల పరిధిలో 432 రైతు భరోసా కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో రబీ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు 146434.86 ఎకరాల్లో వివిధ పంటలను సాగుచేశారు. ఇందులో ఇప్పటి వరకు 17317 మంది రైతులకు సంబంధించి 42090.21 ఎకరాల్లో 28.74 శాతం మేర ఈ క్రాప్ నమోదైంది. ఇంకా లక్షకు పైగా ఎకరాలల్లో ఈ క్రాప్ నమోదు కావాల్సి ఉంది. వీటిలో ఏఏ పంటలు ఎంతమేర సాగయ్యాయనే వివరాలను విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్, విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్‌లు నేరుగా రైతుల పొలం వద్దకే వెళ్లి ఈ క్రాప్‌లో నమోదు చేయించే పనిలో ఉన్నారు. గ్రామాలలోని ఈ క్రాప్ నమోదు కోసం రైతులు ఆధార్, బ్యాంకు ఖాతా, ఫోన్ నంబర్లు, భూమికి సంబంధించిన వివరాలు తీసుకుని ఆధార్ బేస్డ్ డేటాను అనుసంధానం చేసి యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియను సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో సాగుతోంది.

ఇవీ ప్రయోజనాలు

పంట నమోదు వల్ల వరదలు, తుఫాన్‌ల సమయంలో పంటలకు ఏదైనా నష్టం జరిగితే ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ అందుతోంది. అంతేకాక పంటల బీమా కావాలన్నా, సున్నా వడ్డీకి పంట రుణాలు కావాలన్నా, రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు తీసుకోవాలన్నా ఈ క్రాప్‌లో నమోదు తప్పని సరి. పండించిన పంట ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు కూడా ఈ క్రాప్ తప్పనిసరి.

జిల్లాలో రబీలో సాగైన పంటలు... ఈ క్రాప్ నమోదు వివరాలు ఇలా..

పంటలు	సాగైన విస్తీర్ణం (ఎకరాల్లో)	ఈ క్రాప్ నమోదు (ఎకరాల్లో)	శాతం
వరి	2322.88	884.01	39.05
పత్తి	206.56	88.04	42.62
వేరుశనగ	6622.07	3280.31	49.54
కంది	318.63	109.87	34.48
మొక్కజొన్న	2734.29	948.72	34.70
సజ్జ	22.23	17.05	76.70
ఆముదం	81.51	61.79	75.81
మినుము	50021.9	20351.28	40.68
కుసుమపంట	130.91	50.98	38.94
పెసర	3135.42	1123.61	35.84
జొన్నలు	17448.1	4452.6	25.52
ఆవుగడ్డి	363.09	18.13	4.99
పొద్దుతిరుగుడు	335.92	62.31	18.55
నువ్వుపంట	3632.14	1368.26	37.67
శనగపంట	58931.7	9211.53	15.63
పొగాకు	98.8	61.72	62.47
మొత్తం	146434.86	42090.21	28.74

అందరూ నమోదు చేయించుకోవాలి



రబీలో పంటలు సాగుచేసిన రైతులందరూ ఈ క్రాప్ నమోదు తప్పని సరిగా చేయించుకోవాలి. దీనివల్ల ప్రభుత్వ ప్రయోజనాలకు అర్హత లభిస్తుంది. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఈ కార్యక్రమం జరుగుతోంది. కావున పంటలు సాగు చేసిన ప్రతి రైతు కచ్చితంగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి.

– అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి

గడువు లోపు పనులు పూర్తి చేయండి



సింహాద్రిపురంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

సింహాద్రిపురం: మండల కేంద్రమైన సింహాద్రిపురంలో వైఎస్సార్ పార్క్, తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్ నూతన భవనాలతో పాటు అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డిలతో కలిసి వివిధ అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. అభివృద్ధి పనులను ప్రారంభించడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్న సందర్భంగా హెలీప్యాడ్ స్థలంతో పాటు సీఎం మాట్లాడే సభ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అరవిందనాథరెడ్డి పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం చిరస్మరణీయం



పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఇతర అధికారులు

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ఆవిర్భావం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని డీఆర్వో గంగాధర్ గౌడ్ అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభ శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో డీఆర్వో అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పట్లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం వరుసగా 58 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి, చివరికి ప్రాణాలర్పించిన మహనీయుడు శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు వారందరికీ చిరస్మరణీయుడని కొనియాడారు. బీసీ సంక్షేమాధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మ గౌరవం కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని గాంధేయ మార్గంలో పోరాటం చేసి ప్రాణాలర్పించిన అమర జీవి త్యాగాన్ని ఈ తరం యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి అధికారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కౌసర్ భాను, బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ, కలెక్టరేట్ ఏఓ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతుడు అంజనేశ్వరరెడ్డి

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు గ్రామంలో విద్యుదాఘాతంతో అంజనేశ్వరరెడ్డి (37) అనే రైతు దుర్మరణం చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. అంజనేశ్వరరెడ్డి గురువారం అర్ధరాత్రి సమయంలో పొలంలో ఉండగా బోరు మోటరు వద్ద విద్యుత్ తీగ తగలడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహానికి వెళుతూ


మృతి చెందిన సుభాషిణి

జమ్మలమడుగు రూరల్ : కర్నూల్ జిల్లా ఆళ్లగడ్డ మండలంలోని ఆర్ క్రిష్ణపురం గ్రామానికి చెందిన వివాహిత మహిళ సుభాషిణి (30) తండ్రి సుబ్బరాయుడుతో కలసి మైలవరంలో జరిగే బంధువుల వివాహానికి శుక్రవారం రాత్రి వస్తుండగా మార్గ మధ్యంలోని జమ్మలమడుగు మండల పరిధిలోని రామిరెడ్డిపల్లె రహదారిలో స్పీడ్ బ్రేకర్ వద్ద స్కూటర్ అదుపు తప్పి కిందపడి తీవ్ర గాయాలపాలైంది. వెంటనే స్థానికులు 108 సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. సుభాషిణికి భర్త ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

విద్యార్థిని పట్ల బస్సు క్లీనర్ అనుచిత ప్రవర్తన

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వై-జంక్షన్‌లో ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని పట్ల సదరు పాఠశాల బస్సు క్లీనర్ శుక్రవారం అనుచితంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని ఇంటికి వెళ్లిన తరువాత బాధిత విద్యార్థిని తల్లిదండ్రులకు తెలియజేసింది. దీంతో పాఠశాల వద్దకు విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు వచ్చి క్లీనర్‌ను చితకబాదారు. ఈసంఘటనపై సమాచారం రావడంతో పోలీసులు ఇరువైపుల వారిని విచారించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

లభ్యంకాని మృతదేహం వివరాలు

ముద్దనూరు : మండలంలోని చిన్నదుద్యాల గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం గాలేరు-నగరి కాలువలో గుర్తించిన మృతదేహానికి సంబంధించిన ఎటువంటి ఆనవాళ్ళు లభించలేదు. కాలువలో తేలియాడుతున్న మృతదేహానికి శుక్రవారం సంఘటనా స్థలంలోనే వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు.

జాతీయ రహదారి పనుల్లో కదలికలు

- త్వరలో రైతులకు పరిహారం
- పూర్తయిన భూసేకరణ

జమ్మలమడుగు : 67వ నంబరు జాతీయ రహదారి పనుల్లో కదలికలు ప్రారంభమయ్యాయి. నంద్యాల నుంచి కోవెలకుంట్ల మీదుగా జమ్మలమడుగు బైపాస్, ప్రొద్దుటూరు బైపాస్ మీదుగా ముద్దనూరు రహదారిలో ఉన్న అంబవరం సమీపంలో జాతీయ రహదారి నిర్మాణం కోసం ముమ్మరంగా అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా భూసేకరణ కార్యక్రమాన్ని ఇప్పటికేపూర్తి చేశారు. పలుసార్లు పెద్దముడియం, జమ్మలమడుగు మండల, పట్టణానికి సంబంధించిన రైతులతో ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి వారి సమస్యలతో పాటు పరిహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జాతీయ రహదారికి సేకరించే భూములకు ధరలను నిర్ణయించామని, రైతులు సమ్మతించాలంటూ చివరి సమావేశంలో వివరించారు.

అత్యధికంగా జమ్మలమడుగులోనే..

67నంబరు జాతీయ రహదారి నిర్మాణం కోసం నంద్యాల జిల్లా సంజామల మండలం నొస్సం గ్రామం వరకు భూసేకరణ పూర్తి చేశారు. వైఎస్సార్ జిల్లాలో


జగనన్న కాలనీలో జాతీయ రహదారి స్థలం

నియోజవర్గంలోని పెద్దముడియం మండలంలోని నాగిరెడ్డిపల్లె, గుల్లకుంట గ్రామాలు, జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు, మోరగుడి, జమ్మలమడుగు, కన్నెలూరు ప్రాంతాలకు రైతులు భూములను కోల్పోయారు. అత్యధికంగా జమ్మలమడుగు మండలంలోని 37.12 ఎకరాల భూమి సేకరిస్తున్నారు. మొత్తం 174 మంది రైతుల భూముల్లో ఈ రహదారి నిర్మాణం సాగుతుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్. ఉప్పలపాడు గ్రామ రైతులకు ఎకరాకు 12.51 లక్ష రూపాయలు, మోరగుడి రైతులకు 16 లక్షలు, జమ్మలమడుగు, కన్నెలూరు రైతులకు ఎకరాకు 24లక్షల రూపాయల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, నంద్యాల జిల్లాలో మొత్తం 62కిలోమీటర్ల నిర్మాణానికి 850 కోట్ల రూపాయలు కేటాయించింది. అంతేకాకుండా వైఎస్సార్ జిల్లా పెద్దముడియం మండలం పాపాయపల్లె నుంచి జమ్మలమడుగు మండలంలోని వేమగుంటపల్లి వరకు మొత్తం 22 కిలోమీటర్ల నిర్మాణం కోసం 198 కోట్లరూపాయలు కేటాయించింది. ఇప్పటికే జాతీయ రహదారి నిర్మాణం కోసం సంబంధించిన భూసర్వే పూర్తిచేసి గెజిట్ విడుదల చేశారు. ఈ క్రమంలోనే రైతులకు సంక్రాంతి లోపు పరిహారం ఇవ్వడం కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు.

> **సంక్రాంతి లోపు పరిహారం పంపిణీ**
>
> జాతీయ రహదారి నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు భూమి సేకరించారు. ధర కూడా నిర్ణయించారు. సంక్రాంతి లోపు రైతులకు పరిహారం అందిస్తాం. ఆ తర్వాత కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ చేసుకుని పనులు ప్రారంభించేలా చూస్తాం. – సురేంద్రారెడ్డి, జాతీయ రహదారి ఏఈ, జమ్మలమడుగు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

రైస్ మిల్లులో విజిలెన్స్ అధికారుల తనిఖీ


రైస్ మిల్లులో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కడప అగ్రికల్చర్ : మిల్లుదారులు ప్రభుత్వ నిబంధనలను పాటించకపోయినా, ఎవైనా అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ ఇన్‌స్పెక్టర్ రెడ్డెప్ప పేర్కొన్నారు. శుక్రవారం విజిలెన్స్ అధికారులు, పౌరసరఫరా శాఖ, తూనికలు కొలతలశాఖ, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ, స్థానిక ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి కడప మండలం పాలెంపల్లి గ్రామంలోని శ్రీసప్తగిరి మిల్‌టెక్ మోడరన్ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులోని బియ్యంకు సంబంధించిన భౌతిక నిల్వలు, రికార్డులను పరిశీలించారు. లోటుపాట్లను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపుతామని వారు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రెడ్డెప్ప, విజిలెన్స్ అగ్రికల్చర్ ఆఫీసర్ బాలగంగాధర్‌రెడ్డి, డీఈఈ ఏవీ జవహర్‌రెడ్డి, ఏఈఈలు అశోక్‌కుమార్, మురళీకృష్ణ, విజిలెన్స్ ఎఫ్ఆర్ఓ రవీంద్రరెడ్డి, సహాయ కంట్రోలర్ ఆఫ్ లీగల్ మెట్రాలజీ తారకనాథరెడ్డి, సివిల్ సప్లైయ్ డిపార్ట్‌మెంట్ సహాయ సరఫరా అధికారి ఎంవీ మనోజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్‌డీటీ వెంకటలక్ష్మి, ఏఎంసీ అసిస్టెంట్ సెక్రటరీ నాగేశ్వరావు, కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కర్మాగారాల యాజమాన్యాలు లైసెన్స్ రుసుం చెల్లించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కర్మాగారాల యాజమాన్యాలు 2024వ సంవత్సరానికి సంబంధించి ఈనెల 31వ తేదీలోగా నిర్ణీత లైసెన్స్ రుసుం సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించాలని కర్మాగారాల తనిఖీ అధికారి కృష్ణమూర్తి తెలిపారు. లైసెన్స్ ఫీజుకు సంబంధించి హెడ్ ఆఫ్ అకౌంటు, డీడీఓ కోడ్‌లలో ఎలాంటి మార్పు లేదని, ఫ్యాక్టరీలలో అదనంగా హార్స్ పవర్ బిగించినా, అదనంగా పనివారిని నియమించినా పెరిగిన దాని ప్రకారం ఫీజు చెల్లించాలని తెలిపారు. పరిశ్రమ బదిలీ, పేరు మార్పు ఉన్నట్లయితే లైసెన్స్ బదిలీలకు, సవరణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిర్ణీత గడువులోగా సీఎఫ్ఎంఎస్ ద్వారా చలానా కట్టి ఒరిజినల్ చలానాను పంపించని పక్షంలో లైసెన్స్ రుసుంపై అదనంగా నెలకు రెండు శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలా చెల్లించని వారి లైసెన్స్ రద్దు చేస్తామని, లైసెన్స్ లేకుండా ఫ్యాక్టరీ నడిపితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివరాలకు 91603 83971, 92958 50949 నెంబరులో సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ


ప్రతిభ క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

గుర్రంకొండ : గుర్రంకొండ తెలుగు జెడ్పీ హైస్కూల్‌కు 8వ తరగతి విద్యార్థి ప్రసన్నకుమార్ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ (కత్తిసాము) పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రసన్న కుమార్ జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రం తరపున ఎంపికయ్యాడు. ఇటీవల నంద్యాలలో నిర్వహించిన ఏపీ స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా తరపున పాల్గొన్నాడు. అండర్-14 విభాగం(సేబర్) వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం, జట్టు విభాగంలో బంగారు పతకాన్ని సాధించినట్లు పీడీ రమేష్ తెలిపారు. అతడిని జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు రాష్ట్రం తరపున ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలో చత్తీస్‌గడ్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. ఇదే పాఠశాలలో చదువుతున్న మరో విద్యార్థి రెడ్డిగోవర్ధన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా తరపున నంద్యాలలో నిర్వహించిన ఏపీ స్కూల్ గేమ్స్ పోటీల్లో (కత్తిసాము) మంచి ప్రతిభ కనబరిచి సర్టిఫికెట్ పొందాడు. శుక్రవారం ఇద్దరు విద్యార్థులను హెడ్మాస్టర్ అహ్మద్‌బాషా, పీడీ రమేష్, ఉపాధ్యాయులు త్రినాథ్, మదన్మోహన్, రెడ్డిమోహన, జావేద్‌లు అభినందించారు.

అనారోగ్యంతో కేజీబీవీ విద్యార్థిని మృతి



కేజీబీవి పాఠశాల సిబ్బందిని విచారిస్తున్న తహసీల్దార్ మంజుల, మెడికల్ ఆఫీసర్ రమేష్‌బాబు (ఇన్‌సెట్) మృతిచెందిన స్వాతి

నిమ్మనపల్లె : నాలుగు రోజుల పాటు విద్యాలయంలో అనారోగ్యంతో బాధపడి, మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో కేజీబీవీ పాఠశాల విద్యార్థిని మృతి చెందింది. వివరాలిలా.. చిత్తూరు జిల్లా పలమనేరు మండలం కొలమానుసపల్లె పంచాయతీ, కల్నాడు గ్రామానికి చెందిన డి.చందు , డి.సుజాత దంపతుల మొదటి కుమార్తె డి.స్వాతి (13) ఈ ఏడాది జరిగిన పాఠశాల అడ్మిషన్లలో భాగంగా నిమ్మనపల్లె మండలం ముష్ఠూరు కేజీబీవీ పాఠశాలలోప్రవేశం పొంది 6వ తరగతి చదువుతోంది. బాలిక తల్లిదండ్రులకు ఐదుగురు సంతానం. మదనపల్లె మండలం వలసపల్లె గ్రామంలో అవ్వతాతలైన వెంకటలక్ష్మి, చిన్నకనమన్న వద్ద స్వాతి ఉంటూ చదువుకుంటోంది. మేనమేమ వరప్రసాద్ బాలికకు సంరక్షుడిగా పేర్కొంటూ కేజీబీవీలో చేర్పించాడు. ఈ క్రమంలో బాలిక నాలుగు రోజుల క్రితం అనారోగ్యానికి గురై జ్వరం, తలనొప్పిబారిన పడింది. విద్యాలయంలోని నర్సు షీబా తాత్కాలికంగా మందులు అందించింది. రెండు రోజులైన నయం కాకపోవడంతో విద్యార్థిని సంరక్షకుడైన వరప్రసాద్‌కు బుధవారం సమాచారం అందించారు. గురువారం ఉదయం కేజీబీవీ పాఠశాలకు వెళ్లి బాలిక స్వాతిని వెంటబెట్టుకుని తీసుకువచ్చాడు. ఇంటికి వెళ్లిన బాలిక కడుపునొప్పి ఉందని చెప్పడంతో పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ బాలికకు స్కానింగ్ చేయాల్సిన అవసరం ఉందని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి వెళ్లాల్సిందిగా చెప్పి అక్కడి నుంచి వైద్యులు రెఫర్ చేశారు. అప్పటికే బాలిక పరిస్థితి ఇబ్బంది కరంగా మారడంతో వెంటనే రాత్రి 11 గంటలకు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో విద్యార్థిని స్వాతి మరోసారి రక్తపు వాంతి చేసుకుని, పరిస్థితి విషమంగా మారి ప్రాణాలు కోల్పోయింది.అనంతరం కుటుంబసభ్యులు బాలిక మృతదేహాన్ని స్వగ్రామమైన కల్నాడుకు తరలించారు. బాలిక మృతి విషయమై ఎస్ఓ మునివెంకటమ్మను విచారించగా బాలిక గత నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతోందని, మూడవ రోజు కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని తెలిపారు.

పర్యవేక్షణ లోపం

కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థినుల ఆరోగ్యం పట్ల ఎస్ఓ, వైద్య సిబ్బంది పర్యవేక్షణ లోపం వల్లే విద్యార్థిని మృత్యువు పాలైనట్లు తెలుస్తోంది. విద్యార్థిని అనారోగ్యం పాలైన వెంటనే స్థానిక ఆస్పత్రికి పంపకపోవడంతో సమస్యను గుర్తించకపోవడంతో పరిస్థితి విషమంగా మారింది. సరైన సమయంలో స్పందించాల్సిన ఎస్ఓ, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే పాఠశాలలో విద్యార్థినులు పలుమార్లు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

అధికారుల విచారణ

విద్యార్థిని మృతిపై తహసీల్దార్ మంజుల, మెడికల్ ఆఫీసర్ రమేష్‌బాబు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కెఎస్ఎన్ మూర్తి అధికారులతో కలిసి కేజీబీవీ పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాల నర్సు షీబాను విచారించారు. ఎస్ఓ మునివెంకటమ్మను అడిగి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తోటి విద్యార్థులతో మాట్లాడారు. విచారణ నివేదికను అధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

నవశకం

విద్యా రంగంలో వినూత్న మార్పులు



నా బిడ్డలను కమలాపురం ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నాను. నా కుమారుడు 9, కుమార్తె 7వ తరగతి జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్నారు. జగనన్న సీఎం అయ్యాక విద్యా రంగంలో వినూత్న మార్పులు చేశారు. మధ్యాహ్న భోజనం మొదలు కొని విద్యా సామగ్రి, యూనిఫామ్, షూస్ అన్ని రకాల సౌకర్యాలు మెరుగు పడ్డాయి. పిల్లలకు గతం కంటే అధికంగా మార్కులు వస్తున్నాయి. తరగతి గదిలో బల్లలు, బోర్డు, డిజిటల్ బోధన తదితర మార్పుల వల్లనే విద్యార్థుల్లో ఆసక్తి పెరిగి మంచి మార్కులు వస్తున్నాయి.
– కామిశెట్టి కళ్యాణ చక్రవర్తి, కమలాపురం

సొంతింటి కల నెరవేరింది



మేము నిరుపేదలం. పనులకు వెళుతూ బతికేవాళ్లం. ఆర్థిక స్థోమత లేని కారణంగా ఇంటిని కూడా నిర్మించుకోలేకపోయాం. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత జగనన్న కాలనీలో మాకు నివేశిత స్థలం ఇచ్చి గృహ నిర్మాణాన్ని మంజూరు చేశారు. ఇల్లు నిర్మించుకున్నాం. సొంతింటి కల నెరవేరింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేలు మరువలేం.
– కొట్లం వరలక్ష్మి, కొండసుంకేసుల, పెద్దముడియం

జగనన్న సురక్షతో ఉచితంగా సర్టిఫికెట్లు



గతంలో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దారు కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగేవాళ్లం. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. వలంటర్ మా ఇంటికి వచ్చి ఆధార్‌కార్డు, రేషన్ కార్డులు తీసుకెళ్లి ఉచితంగా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు తయారు చేయించారు. మా గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారుల ద్వారా నాకు సర్టిఫికెట్లు అందజేశారు.
– బి. వైశాలి, బీఎస్సీ విద్యార్థిని, గాంధీవీధి, సిద్దవటం

వివాహితపై వేధింపులు

బి.కొత్తకోట : వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రశాంత్ శుక్రవారం తెలిపారు. కురబలకోట మండలం సింగన్నగారిపల్లెకు చెందిన విశ్వనాథ్‌కు బి.కొత్తకోట మండలం దిన్నిమీదపల్లెలో పొలం ఉంది. అతని పొలం పక్కనే చౌటకుంటపల్లెకు చెందిన ఓ వివాహిత పొలం ఉండగా అక్కడికి రాకపోకలు సాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఆమెను విశ్వనాథ్ వేధిస్తున్నాడన్న బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి అదృశ్యం


ప్రవీణ్‌కుమార్ రెడ్డి (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరంలోని ఎర్రముక్కపల్లెలో నివాసం ఉంటున్న నిమ్మకాయల ప్రవీణ్‌కుమార్ రెడ్డి (40) ఈనెల 14వ తేదీన మధ్యాహ్నం ఇంటిలో సినిమాకు వెళ్లి వస్తాననీ చెప్పి తిరిగిరాలేదు. తన సెల్ ఫోన్‌ను ఇంటిలోనే వదిలి వెళ్లాడు. ఆర్థిక సమస్యలు, మానసిక ఆవేదనతో ఇంటి నుంచి వెళ్లిపోయివుంటాడని బంధువులు భావిస్తున్నారు. అతని సోదరి హిమబిందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగస్వామి తెలియజేశారు. ఆచూకీ తెలిసిన వారు సీఐ- 9121100510, ఎస్ఐలు 9121100511, 9121100512లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ పేర్కొన్నారు.

భయం వీడితే విజయం మనదే

– అవగాహన సదస్సులో సివిల్స్ విజేత బాలలత



రాయచోటి అర్బన్ : భయం వీడి పోరాడితే విజయం మనదే అని అఖిల భారత సర్వీసుల విజేత ఎం. బాలలత అన్నారు. శుక్రవారం రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కెరీర్ గైడెన్స్, సివిల్స్‌పరీక్షల అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ పోటీ పరీక్షలలో విజయం సాధించాలంటే మానసిక ధైర్యాన్ని కోల్పోకుండా భయం వీడాలన్నారు. అభ్యర్థులు ఏ స్థాయి పోటీపరీక్ష రాయాలనుకుంటున్నారో వాటి కంటే చిన్న ఉద్యోగాల పరీక్షలకు కూడా హాజరైతే మంచి ఫలితాలను సాధించవచ్చునన్నారు. సిలబస్‌పై స్మార్ట్‌గా ఆలోచించి పరీక్ష ప్రిపరేషన్‌ను రూపొందించుకోవాలన్నారు. ప్రతి అంశంపై సొంతంగా నోట్స్ రాసుకుని సంక్షిప్తత పాటించాలని సూచించారు. సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సాయి విద్యాసంస్థల కరస్పాండెంట్ సుబ్బయ్య, ఏడీ సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ బాలాజి, వీఆర్ విద్యాసంస్థల చైర్మన్ వీఆర్‌రెడ్డి, హెచ్‌ఎంలు నరసింహారెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దాల్మియా కర్మాగారంలో అగ్ని ప్రమాదం


డంపింగ్ యార్డ్‌లో మంటలు చెలరేగిన దృశ్యం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలంలోని దాల్మియా కర్మాగారం ఆవరణంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకొంది. శుక్రవారం ఉదయం కర్మగారం ఆవరణంలోని డంపింగ్ యార్డ్‌లో ఉన్న చెత్తకు నిప్పంటుకుంది. మంటలు పెద్ద ఎత్తున వ్యాపించడంతో కర్మాగారం అధికారులు వెంటనే జమ్మలమడుగు, ప్రొద్దుటూరు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. రెండు ప్రాంతాల నుంచి రెండు వాహనాలు వచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. రాత్రి వరకు మంటలను అదుపు చేసేందుకు అధికారులు శ్రమించారు. అయితే ఈ ప్రమాదం షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిందా లేక ఆకతాయిలు నిప్పుపెట్టారా అనేది స్పష్టంగా సమాచారం లేదని దాల్మియా అధికారులు తెలియజేశారు.

కిరాయి పేరుతో ఘరానా మోసం

- అద్దె పేరుతో కార్ల యజమానులకు కుచ్చుటోపీ
- రూ.38 లక్షల విలువచేసే ఎనిమిది కార్లు తీసుకెళ్లిన మోసగాళ్లు
- నిందితుల్లో ఒకరిని అరెస్ట్ చేసిన పోలీసులు


నిందితుడు, అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకొన్న కార్లను చూపుతున్న పోలీసులు

గుర్రంకొండ : తమకు కన్‌స్ట్రక్షన్స్ కంపెనీలు ఉన్నాయి, వాటికి అవసరమైన కార్లు అద్దెకు కావాలంటూ ఓ మోసగాడు కార్ల యజమానులకు టోకరా వేసిన సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో చోటుచేసుకుంది. ఆరుగురు కార్ల యజమానుల వద్ద అద్దె పేరుతో రూ. 38 లక్షల విలువచేసే ఎనిమిది కార్లను తీసుకెళ్లి మరో కొంతమందికి తనఖాకు పెట్టిన మోసగాడిని ఎట్టకేలకు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. గుర్రంకొండ ఇందిరమ్మ కాలనీకి చెందిన రాళ్లమడుగు సుబ్రమణ్యం (42), సంబేపల్లె మండలం మోటకట్ల పంచాయతీ శంకరాపురంకు చెందిన ఎన్నసాని లోకేష్‌కుమార్ (25) కార్లు అమ్మడం, కొనడం వంటి వ్యాపారం చేస్తున్నారు. ఎనిమిది నెలల క్రితం కలికిరి పట్టణానికి చెందిన షేక్ ఇమ్రాన్ వద్దకు వీరు ఇద్దరు వెళ్లారు. తమకు ఎం కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఉందని, సదరు కంపెనీ ప్రస్తుతం రాజంపేటలో రోడ్డు పనులతో పాటు హంద్రీనీవా కాలువ పనులు చేస్తోందని నమ్మించారు. ఈ కంపెనీలో పనిచేసే ఇంజినీర్ల రాకపోకల కోసం కొన్ని కార్లు అద్దెకు కావాలని చెపచెప్పారు. ఒక కారుకు నెలకు రూ.30 వేలు అద్దె ఇస్తామని నమ్మించారు. వీరి మాటలు నమ్మిన ఇమ్రాన్ తనతో పాటు తన ఐదుగురు స్నేహితుల దగ్గర ఉన్న ఆరు ఇథియోస్ కార్లు, రెండు ఇన్నోవాలు వారికి అద్దెకు ఇచ్చాడు. నాలుగునెలల పాటు ఇమ్రాన్‌కు వారి స్నేహితులకు అద్దె చెల్లించాడు. ఆ తరువాత అద్దె చెల్లించకపోగా తప్పించుకొని తిరగసాగాడు. మోసగాళ్లు ఇద్దరు ఈ ఎనిమిది కార్లను వైఎస్సార్, చిత్తూరు జిల్లాలో పలువురికి తాకట్టు పెట్టేశారు.

● వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలం గంగారపువాండ్లపల్లెకు చెందిన తులసీరెడ్డి అనే వ్యక్తి వద్ద ఒక ఇథియోస్ కారును రూ. 2.90 లక్షలకు తనఖాకు పెట్టారు. అలాగే ఇదే మండలానికి చెందిన కొండ్రెడ్డి అనే వ్యక్తికి మరో ఇథియోస్ కార్లు రూ.5 లక్షలకు తనఖాకు పెట్టారు. అలాగే మహదేవపల్లెకు చెందిన మల్లీశ్వరరెడ్డి అనే వ్యక్తికి మరో కారు రూ. 1.50 లక్షలకు తనఖాకు పెట్టారు. చిత్తూరు జిల్లా సోమల టౌన్‌కు చెందిన హరినాథ్ అనే వ్యక్తికి రూ. లక్షకు మరో కారు తనఖాకు పెట్టారు. వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలం తిమ్మారెడ్డిగారిపల్లెకు చెందిన నాగేశ్వర్‌రావ్ అనే వ్యక్తికి ఇన్నోవా కారును రూ.1.50 లక్షలకు అలాగే కొండారెడ్డి అనే వ్యక్తికి మరో ఇన్నోవా కారును రూ. 1.50 లక్షలకు తనఖాకు పెట్టారు.

ఈ సంఘటనపై ఇమ్రాన్ అతని స్నేహితులు గుర్రంకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి మోసగాళ్లలో ఒకరైన సుబ్రమణ్యంను శుక్రవారం అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు అతని వద్ద నుంచి ఆరు ఇథియోస్, రెండు ఇన్నోవా కార్లను స్వాధీనం చేసుకొన్నట్లు వాల్మీకిపురం సీఐ సురేష్‌కుమార్, గుర్రంకొండ ఎస్ఐ దిలీప్‌కుమార్‌లు తెలిపారు. కాగా ఈ కేసులో మరో మోసగాడు లోకేష్‌కుమార్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.